క్లుప్తంగా

బ్రిడ్జిపై మట్టి తొలగింపు



దోజర్‌తో మట్టిని తొలగిస్తున్న సిబ్బంది

కొలిమిగుండ్ల: స్థానిక ప్రధాన రహదారిలోని బ్రిడ్జిపై పేరుకుపోయిన మట్టిని మంగళవారం సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో తొలగించారు. వర్షాలు కురిసిన సమయంలో వర్షపు నీరు కిందకు పోయేందుకు ఏర్పాటు చేసిన రంధ్రాలు మట్టితో పూడిపోయాయి. వర్షం కురిసినప్పుడు బ్రిడ్జిపైనే నీరు నిల్వ చేరుతున్నాయి. సర్పంచ్ చొరవ తీసుకుని డోజర్ సాయంతో రెండు వైపులా పేరుకుపోయిన మట్టిని తొలగించి శుభ్రం చేయించారు.

సకాలంలో మందులు వాడితే కుష్టు నయం



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు

బనగానపల్లె రూరల్: కుష్టువ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే గుర్తించి చికిత్స తీసుకుంటే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు అన్నారు. మంగళవారం టంగుటూరు గ్రామంలోని పీహెచ్‌సీలో కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కుష్టువ్యాధి మైకో బ్యాక్టీరియం లెప్రి అనే బ్యాక్టీరియా వల్ల వ్యాపిస్తుందన్నారు. దగ్గడం, తుమ్మడం వల్ల ఇతరులకు వ్యాపిస్తుందని.. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి తగిన మందులను వాడాలని సూచించారు. కుష్టువ్యాధిపై ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు సర్వే జరుగుతుందని తెలిపారు. ఇళ్ల వద్దకు వచ్చే ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, వలంటీర్లకు ప్రజలు సహకరించాలని కోరారు. డాక్టర్ సోహైల్‌బాబు, ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, సూపర్ వైజర్ అయ్యమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

పుట్ట పెద్దమ్మకు ఆషాడమాస పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: ఆషాడమాసం సందర్భంగా బనగానపల్లె మార్గంలోని పుట్ట పెద్దమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి రామకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అభిషేకం, పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళహారతి ఇచ్చారు. అలాగే వాసవీ మాతకు ఆర్యవైశ్యులు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరి దేవి, సిమెంట్ నగర్ గ్రామంలోని సుంకులా పరమేశ్వరి దేవికి పూజలు చేశారు.

నగర పంచాయతీ కమిషనర్‌పై విచారణ



కమిషనర్‌ను విచారిస్తున్న ఎస్‌ఐ శివ శంకర్‌నాయక్

బేతంచెర్ల: నగర పంచాయతీ కమిషన్ రమేష్ బాబు తనను వేధిస్తున్నాడని సచివాలయం –5 ఇంజినీరింగ్ అసిస్టెంట్ భారతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్‌ఐ శివశంకర్ నాయక్ మంగళవారం నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ రమేష్ బాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ భారతి, ఇతర ఉద్యోగులను విచారించారు. విచారణలో వెల్లడైన విషయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

సేవ్ నేచర్.. సేవ్ ఫ్యూచర్



గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న విద్యార్థులు

డోన్ టౌన్: ప్రకృతిని కాపాడుకుంటేనే భవిష్యత్ బాగుంటుందని శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ ఉమారెడ్డి, డీన్‌లు మద్దిలేటి, రంగడు అన్నారు. గ్రీన్ ఇండియా మిషన్‌లో భాగంగా మంగళవారం విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్కూల్ ఆవరణలో మొక్కలు నాటించారు. పర్యావరణంలో మార్పులు చోటు చేసుకుని భూతాపం పెరుగుతోందన్నారు. గాలి, నీరు, భూమిని రక్షించుకోవాలని.. ఇందు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ సువర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు



పాతపేటలో విహరిస్తున్న దస్తగిరిస్వామి



కొండపేట జెండాకట్ట వీధిలో పీర్లచావిడి వద్ద భక్తుల కోలాహలం



బేతంచెర్ల: కోటపేటలో పీర్లకు పూజలు చేస్తున్న భక్తులు

డోన్: మత సామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం పెద్దసరిగెత్తును పురస్కరించుకుని అన్ని పీర్లచావిళ్లు భక్తులతో కిటకిటలాడాయి. పలువురు భక్తులు స్వామి వారికి దట్టీలు, వెండి గొడుగులు సమర్పించారు. మరి కొందరు నూతన వస్త్రాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కందూర్లు నిర్వహించి బంధువర్గంతో పాటు భక్తులకు మాంసాహార విందును ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. వార్ల వైభవాన్ని కళ్లారా చూసి తరించారు.

ప్యాపిలి: మండల ప్రజలు పెద్ద సరిగెత్తును భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని బందేనవాజ్, దస్తగిరి, లాల్‌స్వామి, చిన్న గుడిమిర్లాళ్ల, పెద్దగుడి మిర్లాళ్ల, బీబీ ఫాతిమా తదితర పీర్ల చావిడీలు భక్తులతో కిక్కిరిసాయి. ప్రజలు పీర్ల స్వాములను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పెద్దసరిగెత్తు సందర్భంగా జలదుర్గం, హుసేనాపురం, రాచర్ల, పెద్దపాదిళ్ల, చిన్నపాదిళ్ల, గుడిపాడు తదితర గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. పీర్లచావిళ్ల ఎదురుగా ఏర్పాటు చేసిన అగ్నిగుండం వద్ద యువకులు చిందులు తొక్కుతూ భక్తి భావాన్ని చాటారు.

వాడవాడలా మొహర్రం వేడుకలు

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్లతో పాటు ముద్దవరం, ఎం.పేండేకల్లు, ఆర్.బుక్కాపురం, ఆర్‌ఎస్ రంగాపురం, సిమెంట్ నగర్, యంబాయి, అంబాపురం గ్రామాల్లో పెద్ద సరిగెత్తు వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని కోటపేట, గౌరిపేట, బైటిపేట కాలనీల్లోని చావిళ్లలో కొలువైన పీర్లకు భక్తులు ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. యువకులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. రహిమానుపురం గ్రామంలో సర్పంచ్ ప్రమీలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనాథ్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

బనగానపల్లెలో..

బనగానపల్లెరూరల్: పట్టణంలో పెద్ద సరిగెత్తు వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా కొండపేటలోని పెద్దపీర్ల చావిడీల్లో కొలువైన హజరత్ ఇమామే హుస్సేన్, ఇమామేహుస్సేన్ పీర్లతో పాటు పట్టణంలో కొలువైన పలు పీర్లను హిందూ, ముస్లింలు పెద్ద సంఖ్యలో దర్శించుకుని ఫతేహాలు, పూలదట్టీలు సమర్పించారు. కొండపేట పెద్దపీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద భక్తుల సందడి నెలకొంది. బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



అలంకరణలో బందేనవాజ్ పీర్లు



బేతంచెర్ల: రహిమానుపురంలో..



బనగానపల్లె: పెద్ద పీర్లచావిడిలో ఫతేహాలు సమర్పిస్తున్న భక్తులు



పీర్లచావిడి వద్ద ఏర్పాటు చేసిన దుకాణాల్లో భక్తుల సందడి

ఊరూరా పీర్ల పండుగ



బందార్లపల్లెలో పీర్లకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

కొలిమిగుండ్ల: మొహర్రం వేడుకల్లో భాగంగా మంగళవారం పెద్ద సరిగెత్తును ఘనంగా జరుపుకున్నారు. బందార్లపల్లె, మీర్జాపురం, ఇటిక్యాల, బెలుం తదితర గ్రామాల్లో పీర్ల చావిళ్లను అందంగా ముస్తాబు చేసి పీర్ల స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పీర్ల చావిళ్ల వద్దకు పెద్ద ఎత్తున చేరుకుని పట్టువస్త్రాలు సమర్పించి చదివింపులు చేశారు. పెద్ద సరిగెత్తును పురస్కరించుకుని బందార్లపల్లెలో భక్తులకు అన్నదానం చేశారు. పీర్ల చావిళ్ల ఎదురుగా అగ్నిగుండాలను ఏర్పాటు చేశారు. ముజావర్ల ప్రత్యేక పూజల అనంతరం అర్ధరాత్రి దాటాక భక్తులు పీర్లను ఎత్తుకుని నిప్పుల గుండంలో తిరిగారు. బుధవారం మొహర్రం సందర్భంగా పీర్లను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేయనున్నారు.



అగ్నిగుండం

విద్యుత్ స్తంభాలను సరిచేశారు..!

సాక్షి ఎఫెక్ట్



కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–గుంజలపాడు ఆర్అండ్‌బీ రహదారిలో కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలను అధికారులు సరిచేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పక్కన ఉన్న విద్యుత్‌స్తంభాలు ఒరిగిపోయాయి. ఈ దారిలో సాయిబాబా గుడికి వెళ్లే భక్తులకు ప్రమాదం పొంచి ఉండడంతో ఈ నెల 15వ తేదీ సాక్షి దినపత్రికలో 'నిలువెత్తు నిర్లక్ష్యం' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన స్థానిక విద్యుత్ శాఖ అధికారులు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పంటలో తెగుళ్ల నివారణపై అవగాహన



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

డోన్ రూరల్: వివిధ పంటల్లో ఆశించే తెగుళ్లపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేయాలని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ ఎ.రామకృష్ణారావు, సీనియర్ శాస్త్రవేత్త బాలాజీ నాయక్ వ్యవసాయ అధికారులకు సూచించారు. మంగళవారం డోన్ మండల పరిధిలోని యు.కొత్తపల్లి, ఉంగరానిగుండ్ల, సీసంగుంతల గ్రామాల్లో రైతులు సాగు చేసిన వేరుశనగ, కందిపంటలను పరిశీలించారు. ప్రస్తుతం వేరుశనగ పంటలో తామర పురుగు, పచ్చదోమ, పేనుబంక, శెనగ పచ్చ పురుగు, వేరు కుళ్లు, ఆకుపచ్చ తెగుళ్లు ఆశించి నష్టం చేస్తున్నాయని తెలిపారు. వాటికి తగిన మందులను వ్యవసాయ అధికారులను సంప్రదించి పిచికారీ చేయాలని సూచించారు. పంటలకు ఎక్కువగా పురుగులు పట్టే అవకాశం ఉందని.. జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారి వెంట ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి అబ్దుల్‌షఫీ ఉన్నారు.

ఆడపిల్లలపై అరాచకాలకు అడ్డుకట్టవేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బేతంచెర్ల: ఆడ పిల్లలపై జరుగుతున్న అరాచకాలకు అడ్డుకట్టవేయాలని ఎమ్మార్పీఎస్ డోన్ నియోజకవర్గ అధ్యక్షుడు సత్యం, బేతంచెర్ల అధ్యక్షుడు మాధవిస్వామి అన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆడపిల్లలపై అరాచకాలకు పాల్పడుతున్న వారిని శిక్షించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నందికొట్కూరు మండలం ముచ్చుమర్రి గ్రామంలో బాలికపై మైనర్‌లు హత్యాచారం చేసి ఘటన మరవకముందే శ్రీకాకుళం జిల్లాలో ఆరునెలల పసికందుపై లైంగిక దాడి, గుంటూరు జిల్లా కొత్తరెడ్డి పాళ్యానికి చెందిన 8వ తరగతి విద్యార్థిని అదే గ్రామానికి చెందిన గ్యాస్ డెలివరీ బాయి ఇంట్లో శవమై కనిపించడం కలచివేసిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులకు ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజు, సూరి పాల్గొన్నారు.

వేళకు రారు.. నిమిషమైనా ఆగరు



గుమ్మకొండలో తెరుచుకోని హెల్త్‌క్లినిక్



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న గ్రామ సచివాలయం

డోన్ రూరల్: స్థానికంగానే ప్రజలకు సేవలు అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన గ్రామ సచివాలయాలు నేడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉద్యోగుల ఇష్టారాజ్యంగా మారిపోయింది. మండలంలోని పలు సచివాలయల్లో ఉద్యోగులు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి. విధులకు వేళకు రాకపోయినా సాయంత్రం మాత్రం నిమిషం ఆగకుండా ఇంటికి వెళ్లిపోతారు. గుమ్మకొండ గ్రామంలో మంగళవారం ఉదయం 11.30 గంటలు అవుతున్న గ్రామ సచివాయలం, హెల్త్‌క్లినిక్‌లకు ఒక్క ఉద్యోగి కూడా రాలేదు. హెల్త్ క్లినిక్‌కు వేసిన తాళాలు వేసినట్లే ఉన్నాయి. గ్రామ సచివాలయంలో కేవలం ఒకే ఒక్క డిజిటల్ అసిస్టెంట్ తప్ప ఎవరూ రాలేదు. గ్రామస్తులు ఉద్యోగుల కోసం ఎదురుచూసి నిరాశగా తిరుగుముఖం పట్టారు.

రికార్డులు లేని వాహనదారులకు జరిమానా

కోవెలకుంట్ల: పట్టణంలోని గ్రామ పంచాయతీ సర్కిల్‌లో ఎస్‌ఐ వరప్రసాద్ మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు, తదితర ప్రాంతాల వైపు వెళుతున్న వాహనదారులను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

ముగ్గురిపై కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని నాగమళ్లకుంట గ్రామానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు. ఆయన వివరాల మేరకు.. నాగమళ్లకుంట గ్రామానికి చెందిన దయ్యాల పామయ్య ఈ నెల 4వ తేదీ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన దయ్యాల భూపాలు, దశరథుడు, శ్రీనివాసులు రాయితో దాడి చేశారని బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప వెల్లడించారు.

నూతన కార్యవర్గం

ప్యాపిలి: మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ప్యాపిలి మండల నూతన కార్యవర్గం మంగళవారం ఏర్పాటైంది. మండల అధ్యక్షుడిగా సయ్యద్ అక్బర్ వలి, ఉపాధ్యక్షులుగా ముస్తఫా, చాడంగుల మాలిక్ బాషా, సెక్రెటరీగా సయ్యద్‌బాషా, సయ్యద్ ముఫ్తద్ హుసేన్, జాయింట్ సెక్రెటరీలు సహా మరో ఎనిమిది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. మైనార్టీల హక్కుల కోసం తమ కార్యవర్గం కృషి చేస్తుందని అధ్యక్షుడు సయ్యద్ అక్బర్ తెలిపారు.

శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శనగల బసవన్న, బయలువీరభద్రస్వామి వారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రదోష కాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. గణపతి పూజ అనంతరం నందీశ్వరస్వామికి వస్త్ర సమర్పణ, విశేషార్చనలు, నానబెట్టిన శనగలు, క్షేత్రపాలకునికి నైవేద్యాన్ని సమర్పించారు.

పకడ్బందీగా కుష్టు సర్వే



ఆశావర్కర్లకు సూచనలిస్తున్న ఉప్పలపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి వినోద్‌కుమార్

అవుకు: కుష్టువ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం అవుకు ఎంపీడీఓ కార్యాలయ భవనంలో ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్టు వ్యాధి సర్వే నిర్వహించాలని తెలిపారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పకడ్బందీగా సర్వే చేయాలని సూచించారు. వ్యాధి లక్షణాలు ఉంటే వైద్యుల దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వే నిర్వహించే సమయంలోనే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు యమున, నవీన్‌కుమార్, పీహెచ్‌ఎన్ మల్లేశ్వరి, సూపర్‌వైజర్లు వరలక్ష్మి, దానమ్మ, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై తస్మాత్ జాగ్రత్త

- మున్సిపల్ కమిషనర్ జయరాం
- 8వ వార్డులో స్పెషల్ డ్రైవ్



డ్రమ్ములోని నీటిని పారబోస్తున్న సిబ్బంది

డోన్: వర్షాకాలంలో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచకుండా చూసుకుని అంటువ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం ప్రజలకు సూచించారు. డోన్ 8వ వార్డులో మున్సిపల్ డీఈ రసూల్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషాతో కలిసి మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎప్పటికప్పుడు మురుగునీటి కాల్వలను శుభ్రపరిచేందుకు సిబ్బంది సహకారం తీసుకోవాలని స్థానికులకు సూచించారు. డ్రమ్ములు, తొట్టిలు, పూల కుండీలు వంటి వాటిలో నీరు నిల్వలేకుండా ఉంటే దోమలను నియంత్రించవచ్చని, తద్వారా డయేరియా, డెంగీ, మలేరియా లాంటి వ్యాధులను అరికట్టవచ్చన్నారు. వాతావరణ మార్పుల వల్ల విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జ్వరం, జలుబు, వీరేచనాలు ఉంటే వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చూపించుకోవాలన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద తరచుగా మోటార్లు మరమ్మతులకు గురవుతున్నందు వల్ల మంచినీటి సమస్య తలెత్తుతోందని తెలిపారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

కర్ణాటక మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాక్సులతో సెబ్ పోలీసులు

బేతంచెర్ల: మండలంలోని రహిమానుపురం గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు డోన్ సెబ్ సీఐ జయనాథ్ రెడ్డి మంగళవారం తెలిపారు. మద్యం విక్రయిస్తున్న యాదవబోయిన శివ ఈశ్వరయ్య పరారయ్యాడు. సంఘటన స్థలం వద్ద 5 మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ. 30 వేలు ఉంటుందన్నారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే డోన్ పట్టణంలో ఇసుక తరలిస్తున్న కంబాలపాడు గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేశామని చెప్పారు. కేసు నమోదు చేసి రూ.10 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం, సారా విక్రయాలు, ఇసుక అక్రమ రావాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌ఐ సోమశేఖర్‌రావు, ఇంటెలిజెన్స్ వింగ్ ఎస్‌ఐ అంజద్ బాషా, హెడ్ కానిస్టేబుల్స్ తిరుపాలయ్య, సుధాకర్ రెడ్డి, రమణ, అశ్వత్‌రెడ్డి, కానిస్టేబుల్స్ జయచంద్ర, ఉమాకాంత్ రెడ్డి ఉన్నారు.

వృథాగా చెత్త సంపద కేంద్రాలు



కొలిమిగుండ్లలో కొండపై నిర్మించడంతో వృథాగా మారిన కేంద్రం

కొలిమిగుండ్ల: గ్రామాల్లో లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు వృథాగా మారాయి. గ్రామాలకు దూరంగా నిర్మాణాలు చేపట్టడంతో సేకరించిన చెత్తను తీసుకెళ్లేందుకు వీలు పడక అలంకార ప్రాయంగా మారాయి. గ్రామ పంచాయతీలకు మంజూరు చేసిన రిక్షాలు మూలన పడ్డాయి. స్వచ్ఛ సంకల్పం పేరుతో మండలంలో 16 పంచాయతీల్లో జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల కింద సుమారు రూ. 6 లక్షల వ్యయంతో చెత్త సంపద కేంద్రాలను నిర్మించారు. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను తీసుకొచ్చి డంపింగ్ యార్డుల్లో వేసి సేంద్రియ ఎరువును తయారు చేసి చేయాల్సి ఉంటుంది. ఎరువును విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుతుందనే ఉద్దేశంతో ఇవి ఏర్పాటు చేశారు.

రోడ్ల పక్కల చెత్త కుప్పలు

గ్రామాల్లో ఎక్కడ చూసినా రోడ్లు, వీధుల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్తను ఎక్కడ వేయాలో తెలియక ప్రజలు ఎక్కడ పడితే అక్కడే పడేస్తున్నారు. కొలిమిగుండ్లలో ప్రధాన రహదారిపై మాత్రమే స్వీపర్లు శుభ్రం చేసి వెళుతున్నారు. మిగిలిన వీధుల్లో చెత్త వేసేందుకు మార్గం లేక ప్లాస్టిక్ సంచుల్లో నింపుకుని బ్రిడ్జిలో పడేస్తున్నారు. కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలో చెత్త సంపద కేంద్రాన్ని నిర్మించడంతో ఒక్క రోజు ఉపయోగించిన దాఖలాలు లేదు. చెత్త కుప్పల నుంచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఎక్కడ వ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నేడు వాసవీమాత జయంతోత్సవాలు

డోన్ టౌన్: పెనుకొండలోని వాసవీమాత ఆయంలో బుధవారం జరిగే అమ్మవారి జయంతి ఉత్సవాలకు ఆర్యవైశ్యులు తరలిరావాలని ఆవోపా కార్యదర్శి జోన్నలగడ్డ శ్రీనివాసులు కోరారు. డోన్ వాసవీ మహిళా మండలి సభ్యులతో వాసవిమాత చాలీసా పారాయణం చేయనున్నట్లు తెలిపారు.